# నేనోయ్ దేవుణ్ణి!



బులుసు - జీ-ప్రకాష్

**"దేవుడు లేడు. ముమ్మాటికీ లేడు. ఉన్నాడంటే నమ్మను. నువ్వు భ్రమిస్తున్నావ్. నువ్వేకాదు, అందరూ భ్రమిస్తున్నారు. దేవుడు లేడని ఢంకా బజాయించి చెబుతాను" అన్నాడు శఠగోపం.**

ఎదురుగా వున్నబల్ల గడగడా వణికింది.

"అబ్బా! నీలో ఇంకా ఈ అజ్ఞానం ఎప్పుడు పోతుందోయ్? నీ మట్టుకు నువ్వు లేడనే అనుకో. నా గొడవ నీకెందుకు? నేను, దేవుడున్నాడనే నమ్ముతాను. హే ప్రభూ!"

"వీల్లేదు. నువ్వు మాత్రం ఎందుకు నమ్మాలి?"

"అది నా ఇష్టం. నాకు దేవుడున్నాడంతే. హే కృష్ణా!"

"అదే పొరపాటు. దేవుడుంటే కనబడ్డేమి? ఉంటే చూపించు!" శఠగోపం మొండితనం విడువలేదు.

"చూడు మిత్రమా! దేవుడే నిజంగా కనిపిస్తే అతన్ని చూడగలవుటోయ్? అతను అనంత కోటి ప్రకాశుడు. ఒక సూర్యుణ్నే మనం చూడలేము. అర్జునుడంతటివాడే చూడలేక తేజాన్ని ఉపసంహరించుకోమని కృష్ణభగవానుణ్ని ప్రార్థించాడు. మనం అనగా ఎంత? అల్పజీవులం!" అన్నాడు మిత్రుడు.

"అలాగే తన తేజాన్ని ఉపసంహరించుకుని కనబడమను. లేకపోతే ఉన్నాడని బుజువేమిటి?"

"చూడు నీకు ఉద్యోగం వచ్చి ఎన్నాళ్ళయింది? రెండు నెలలు. అంతకు ముందు ఉద్యోగాన్వేషణలో ఎన్నాళ్ళు తిరిగేవు? ఎన్నాళ్ళుకాదు, ఎన్నేళ్ళు తిరిగేవు? నిన్ను తల్లిదండ్రులు కని, పెంచినందుకు వారి ఋణం తీర్చుకోడం వట్టిమాటే! ఐనా ఉడుతాభక్తిగా నీకు ఉద్యోగమైతే కొన్ని కష్టాలు గట్టెక్కుతాయని వారు ఆశిస్తారు కదా?"

"కావచ్చు. అయితే?"

"అదే భగవంతుని కరుణోయ్. ఆయన కరుణా సముద్రుడు. నీ అదృష్టం పండి, నీ తల్లిదండ్రుల మొర విని, కరుణా జలధిలోని ఒక బిందువు నీపై రాల్చాడు. దేవుడు కనిపించడం అంటే అలాగే! అంతేకానీ నెమలిపింఛం ధరించి కాంచన చేలుడై, చేత మురళి కర్రతో అందెలు ఘలుఘల్లుమంటూ నీ ఎదుటికి పరుగెత్తుకొస్తాడటోయ్ వెర్రివాడా!"

"అలాగంటే నేనొప్పుకోను. నాకు ఉద్యోగం వచ్చింది అంటే అందుక్కారణం, కాంపిటీటివ్ ఎగ్జామ్స్ బాగా రాయడమే. అది నా ప్రతిభా పాటవాలకు నిదర్శనం. అంతేకానీ, దేవుడెవడోయ్ కోన్‌కిస్కా?"

"సరే నువ్వలా ఆగు. దేవుడే లేకపోతే 'దేవుడు' అనే మాట ఉద్భవిస్తుందటోయ్? గాలి వుంది. కానీ నీకది కనబడ్డం లేదే. అలాగని గాలి లేదని అనగలుగుతున్నావా? ప్రతి వస్తువుకీ ఒక పేరు వుంది. ఆ వస్తువు ఉండబట్టే కదా ఆ పేరు వచ్చింది? మాటవరసకి నువ్వే శఠగోపారావువి.."

"ఔను. ఎవడు కాదన్నాడు?"

"కాదని ఎలా అంటావు? శఠగోపం అంటే దేవాలయాల్లో భక్తుల శిరస్సులపై అర్చకుడు పెట్టేది. దానిపై దేవుని చరణముద్రికలుంటాయి. శఠగోపం నిజంగా ఉండబట్టేనా ఆ పేరు వచ్చింది? అలాగే దేవుడూను. అంతేకానీ దేవుడు నీ ఎదుట ప్రత్యక్షమై 'నాయనా శఠగోపం నేనోయ్ దేవుణ్ణి నేనున్నానోయ్' అంటూ నీ ఎదుట ప్రత్యక్షమవుతాడటోయ్?"

"అలాగైతే నాస్తికుడు అనేవాడు లేకపోతే ఆ మాట ఎలా పుట్టింది? నువ్వు లక్ష చెప్పు. నేన్నమ్మను. ఇప్పుడు శివుడో విష్ణువో ప్రత్యక్షమై నన్ను పలకరిస్తేనే దేవుడున్నట్లు నమ్మేది" అంటూ శఠగోపారావు వెళ్ళిపోతుండగా 'ఆగు' అనే కంఠధ్వని వినపడ్డాది. శఠగోపారావు వెనక్కి చూశాడు. అతని కళ్ళు జిగేల్‌మన్నాయి!

"ఎవరు నువ్వు?" అన్నాడు. అతనికారూపం సరిగ్గా అవుపడ్డం లేదు.

"నన్నెరగవుటోయ్ బాబూ! నేను దేవుణ్ణి! నీ తల్లిదండ్రుల రూపంలో నిన్ను కని, పెంచాను. ఇప్పుడు కనిపించాను. అప్పుడే నన్ను మరచిపోయావా? పోనీ ఈ చెయ్యి చూడు. త్రిశూలం! ఈ చెయ్యి చూడు. బుడబుడక్కు! ఆది మధ్యాంత రహితుడైన శివుణ్ణి నేను!"

"అబద్ధం! నీదంతా నాటకం, బూటకం. నువ్వు దేవుడివి కావు. తరచుగా వీధుల్లో అడుక్కునే పగటివేషగాళ్ళు ధరించేవివే! ఇంద నాయనా ఈ రూపాయి బిళ్ళ. ఇహ దయచేయ్. నాకవతల బోల్డు పనులున్నాయి" అన్నాడు శఠగోపారావు.

❋